వైఎస్ఆర్
కడప-అన్నమయ్య వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
ఆదివారం 08 మార్చి 2026

అగ్నికి ఆహుతి అవుతున్న హార్సిలీ హిల్స్ గట్టుకొండ

బి. కొత్తకోట మార్చ్7 ప్రభాతవార్త

బి .కొత్తకోట మండలం హార్సలి హిల్స్ కు సమీపంలోని గట్టు పంచాయితీ గట్టుకొండ అడవి శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతి అయింది. అడవి అగ్ని బారిన పడిన సంఘటన తెలుసుకున్న ఫారెస్ట్ రేంజర్ జయప్రసాదరావు, ఫారెస్ట్ శివ అప్రమత్తమై తన సిబ్బందితో మంటలు ఆర్పడానికి విశ్వ ప్రయత్నం చేసిన ప్రయోజనం లేక గట్టుకొండ ప్రాంతం మంటల పాలయింది. మంటలు నాయన బావి నుండి వ్యాపించి గట్టుకొండ అటవీ ప్రాంతానికి సమీపంలోని గుట్టలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ అగ్ని ప్రమాదం లో విలువైన కలప, వంట చెరుకు, బోధ, పచ్చని చెట్లు, వనమూలికలు, పశుగ్రాసం కాలి బూడిదయ్యింది. విశ్వప్రయత్నం తరువాత మంటలు అదుపులో ఉన్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు.

జాతి విద్వేషం విడచి

-కలసి తింటే కలదు సుఖం

చౌడేపల్లి, మార్చి 7 ప్రభాతవార్త

దేవస్థానంలో వానరం ఎక్కడి నుంచి తెచ్చుకుందో టెంకాయచిప్పను నేలకేసి బాది వచ్చిన కొబ్బరిని శనకానిచ్చి తింటుండగా " వార్త "కంట పడింది. సాధారణంగా వానరం, శునకాలకు మధ్య వైరం వుంది. జాతి విద్వేషాలను పక్కన పెట్టి ఉన్నంతలో కలసి తింటే కలదు సుఖమంటూ రెండు వ్యతిరేక వర్గానికి చెందిన జంతువులు సమాజానికి సందేశమిస్తున్నాయి. స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వానరం, శునకం కలసి తింటున్న దృశ్యాన్ని భక్తులు చూసి ముక్కుపై వేలు వేసుకొన్నారు. మనుష్యుల్లోనూ ఇదే భావన వుంటే సమాజం మరింత ముందుకు వెళుతుంది కదాని అందరూ అనుకొన్నారు.

కొబ్బరి ముక్కలను కలసి తింటున్న వానర శునకాలు

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

కడప, మార్చి 7 ప్రభాతవార్త :

పదవ తరగతి పరీక్షలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేలా బోర్డు నిబంధనల మేరకు అన్ని రకాల చర్యలను పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పరీక్షల నిర్వాహక అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత నిర్వహక అధికారులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జేసీ డా. నిధి మీనా తో పాటు పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 28,158 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ పబ్లిక్ పరీక్షలు మార్చి 16 తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లాలోని 169 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఈ పబ్లిక్ పరీక్షలను సర్వీస్ కమిషన్ పరీక్షల తరహాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 9 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపైకి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్ కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల పర్యవేక్షణ ఆషామాషీగా జరిగితే పబ్లిక్ పరీక్షల నిర్వహణకే అర్థం ఉండదన్నారు. అదేవిధంగా ఆ పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టాయిలెట్స్, త్రాగునీరు, ఫ్యాన్లు, లైట్లు వెంటిలేషన్ అన్నీ సక్రమంగా ఉండేలా జిల్లా యంత్రాంగం 18 శాఖల సమన్వయ సహకారంతో ఏర్పాట్లను సంసిద్ధం చేయడం జరుగుతోందన్నారు. రెవెన్యూ, పోలీస్, రవాణా

శాఖ, మెడికల్, విద్యుత్, పోస్టల్ శాఖలు వారికి సబందించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని జాగ్రత్తలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్య నిర్వాహకులు తీసుకోవలసిన జాగ్రత్తలు విధులు తదితరాంశాలపై మాస్టర్ ట్రైనర్ రెహమాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శంశుద్దిన్, డిప్యూటీ డీఈవోలు రాజశేఖర్ రెడ్డి, మీనాక్షి , ఓపెన్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ సాంబశివ రెడ్డి, డిసిఈబి చైర్మన్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు, డిపార్డమెంటల్ అధికారులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమాజానికి మూల స్తంభాలు : మంత్రి మండిపల్లి

రాయచోటి మార్చి 7 ప్రభాతవార్త

మహిళలు సమాజానికి మూల స్తంభాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు పెద్దన్నల అండగా నిలిచిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు.స్త్రీ లేకుండా సృష్టి లేదు, స్త్రీ లేకుండా జీవం లేదు,స్త్రీ లేకుండా ఈ ప్రపంచాన్ని ఊహించలేమన్నారు. మహిళా దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తుచేసుకునే సందర్భమే మహిళా దినోత్సవం అన్నారు. మహిళలు సమాజానికి మూలస్తంభాలు. కుటుంబ నిర్మాణంలోనే కాకుండా దేశ నిర్మాణంలో కూడా వారి పాత్ర అత్యంత కీలకం అన్నారు. ఒక మహిళ సాధికారత పొందితే ఒక కుటుంబం ముందుకు సాగుతుంది, ఒక కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలను కుటుంబ పరిమితుల్లోనే కాకుండా ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూడాలనే దూరదృష్టి కలిగిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళలకు లక్ష కుట్టు మిషన్లు పంపిణీ చేయడానికి శిక్షణ అందిస్తున్నామన్నారు.కుప్పంలో విద్యార్థినులకు 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై నేరాలు తగ్గాయి,మహిళలను గౌరవించాలి, వారి స్వప్నాలకు రెక్కలు కట్టాలి. ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన తెలిపారు. 20 నెలల్లోనే మహిళా సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చి దిద్దిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు చేయాలి

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త :

జిల్లాలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం మదనపల్లె కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో లింగ నిర్ధారణ నిషేధ చట్టం, ప్రసూతి మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, పోలీస్, వైద్యఆరోగ్యశాఖల సమన్వయంతో జరిగే డెకాయ్ ఆపరేషన్లను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా జరపాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల సాయంతో ప్రసూతి మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రమంగా జరిగే లింగ నిర్ధారణ, అబార్షన్లపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి నెలాఖరులోపు డెకాయ్ ఆపరేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలను తరచూ తనిఖీలు చేయాలని సూచించారు. ఎనిమిది, తొమ్మిది,పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.జిల్లాలో ఎంఎంఆర్ మెరుగుపడినప్పటికి ఇంకా మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది జిల్లాలో ఆరు ప్రసూతి మరణాలపై వైద్యశాఖ అధికారులు నివేదికలను కలెక్టర్‌కు వివరించారు. గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యోగసానాలు, వ్యాయామాలు అంశాలపై సూచించారు. అంగన్‌వాడి శాఖ కూడా సమన్వయంతో పనిచేయాలని పీడిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య, బిసి ఎస్‌హెచ్ లక్ష్మీప్రసాద్, నోడల్ అధికారి ఉషశ్రీ, ఐసిడిఎస్ పీడి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎమ్మెల్యేపై ఇచ్చిన ఫిర్యాదులో సాధారణ సెక్షన్లు

అత్యాచారం, మోసం కేసు నమోదు కాలేదు

రాజంపేట, మార్చి 7 ప్రభాతవార్త

రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై తాము చేసిన ఫిర్యాదు ప్రకారం అసలు సెక్షన్లు నమోదు కాలేదని,సాధారణ సెక్షన్లు మాత్రమే నమోదు అయ్యాయని న్యాయవాది సాయి కృష్ణ ఆజాద్ పేర్కొన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని, అత్యాచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్యే తరపున చేసిన ఫిర్యాదులో మాత్రం తమపై తీవ్ర సెక్షన్లు నమోదు చేయడం దారుణమని దీనిపై హైకోర్టులో పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్కు ఫిర్యాదు చేసిన హర్ష వీణ ఈ కేసుకు సంబంధించి రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే ఎదుట విచారణకు హాజరయ్యారు. శనివారం హర్ష వీణ ఎఎస్పీ కార్యాలయానికి న్యాయవాది సాయి కృష్ణ ఆజాద్ తో కలిసి వచ్చారు. జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్పీ ఆమెను విచారించారు. రైల్వే కోడూరు గ్రామపంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న హర్షవీణకు తాము ఇచ్చిన నోటీసు మేరకు విచారణకు హాజరయ్యారని ఎఎస్పీ తెలిపారు. కేసు విచారణలో వెళ్లడయ్యే అంశాలను ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకుపోతామని ఎఎస్పీ తెలిపారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే పై ఆమె ఫిర్యాదు చేశారని వెల్లడించారు. విచారణ అనంతరం హర్షవీణ కేసును వాదిస్తున్న న్యాయవాది సాయి కృష్ణ ఆజాద్ మీడియాతో మాట్లాడుతూ తాముచ్చిన ఫిర్యాదుకు నమోదు చేసిన కేసుకు ఎలాంటి సంబంధం లేదన్నారు.ఒక సాధారణ కేసును మాత్రమే నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే పెళ్లి చేసుకుంటారని నమ్మించి హర్షవీణాను మోసం చేశారని, అలాగే అత్యాచారం చేశారని ఫిర్యాదు చేసామన్నారు. సెక్షన్ 63, 64, 69కింద కేసు నమోదు చేయాల్సి ఉండగా కేవలం సాధారణ శిక్షలతో కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే హర్ష వీణ పై మాత్రం పదేళ్ల శిక్ష పడే 308 కింద కేసు నమోదు చేశారని వివరించారు. విచారణలో ఈ విషయాన్ని కూడా తాము ఎఎస్పీకి తెలియజేశామన్నారు. దీనిపై హైకోర్టులో పోరాడుతామన్నారు. ఇక్కడ రాజకీయ ప్రభావంతో న్యాయం జరగదని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ను ఆశ్రయించినట్లు న్యాయవాది పేర్కొన్నారు. ఒక చిన్న ఉద్యోగి ఎమ్మెల్యేను బెదిరించడం సాధ్యమా అన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ లో తాము న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు. అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

రాజంపేట, మార్చి7 ప్రభాతవార్త

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ విజయవాడ టెలికాం) అధికారి తేజస్విని దేవనబోయిన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, రామ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రజిత మైనంపల్లి, డా. ఎస్.ఏ. తస్లీమ్ సుల్తానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తేజస్విని దేవనబోయిన మాట్లాడుతూ విజయానికి కేవలం ఫలితాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా ఆ ఫలితాలను సాధించే ప్రక్రియపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జీవితంలో అప్పుడప్పుడు విరామం తీసుకుని మన ఆలోచనలను పునరాలోచించడం, మనసును తాజాగాచేసుకోవడం అవసరమని చెప్పారు. మహిళలు భావోద్వేగ బలం, మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలోని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొగలరని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితురాలు డా. ఎస్.ఏ. తస్లీమ్ సుల్తానా మాట్లాడుతూ సమాజంలో ముఖ్యంగా మహిళలలో ఉన్న దివ్యాంగులను గుర్తించి వారికి తగిన రక్షణ, భద్రత, సహాయం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సి. ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎం.వి. నారాయణ, అన్నమాచార్య విశ్వవిద్యాలయం మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త డా. వి. మోనేశ్వరి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డ్యూటీ డైరెక్టర్ డా. బి. జయరామరెడ్డి పాల్గొని మహిళల అభివృద్ధి సమాన అవకాశాల ప్రాధాన్యతను వివరించారు. మహిళల సామర్థ్యాన్ని గుర్తించి వారికి ప్రోత్సాహం కల్పించడం ద్వారా సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు.

పూల దివాకర్ హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

మదనపల్లె క్రైమ్, మార్చి 7 ప్రభాతవార్త.

మదనపల్లెలో సంచలనం సృష్టించిన పూల దివాకర్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తాలూకా సిఐ కళా వెంకట రమణ తెలిపారు. ఈ కేసులో పూల గణేష్ (25), పి సుబ్రహ్మణ్యం (26), మేకల మునికంఠేశ్వర ప్రసాద్ (20) లను నిందితులుగా గుర్తించి శనివారం రిమాండ్ కు తరలించారు. ఏ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీ అరవాండ్లపల్లెకు చెందిన లేట్ లక్ష్మీనారాయణ కుమారుడు పూల దివాకర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవాడు. అదే గ్రామానికి చెందిన పూల గణేష్‌కు, దివాకర్‌కు మధ్య కొంతకాలంగా పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 4వ తేదీ రాత్రి సమయంలో నిందితులు పథకం ప్రకారం దివాకర్‌ను వలసపల్లె పంచాయతీ పరిధిలోని హంద్రీనీవా కెనాల్ సమీపంలో ఉన్న బీడు భూమిలోకి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు. ఆధారాలు దొరక్కుండా మృతదేహాన్ని అల్లనేరేడు చెట్ల పొదల్లో ఉన్న ఒక చిన్న గుంతలో పూడ్చిపెట్టి పరారయ్యారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ అనంతరం ఇది పాత కక్షల వల్ల జరిగిన హత్య కేసు గా నమోదు చేశారు. మదనపల్లె తాలూకా సీఐ ప్రత్యేకబృందం నిందితుల కోసం గాలింపు చేస్తుండగా శనివారం చీకలబైలు పంచాయతీ, బార్లపల్లె సమీపంలోని శ్రీ వృద్ధేశ్వర స్వామి దేవాలయం వద్ద నిందితులు ఉన్నట్లు సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్న తాధికారులు అభినందించారు.

నగిరిగుట్టలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

పులివెందుల, మార్చి 7 , ప్రభాతవార్త :

పట్టణంలోని నగిరిగుట్ట ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఏపీ డీజీపీ శ్రీ హరీష్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈగల్ సెల్ ఐజీ ఆర్.కె. రవికృష్ణ మార్గదర్శకత్వంలో, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆపరేషన్ వజ్రప్రహర్"లో భాగంగా పులివెందుల సబ్ డివిజన్ డీఎస్పీ మురళీ నాయక్ ఆధ్వర్యంలో పులివెందుల రూరల్ సీఐ సీతా రామిరెడ్డి, ట్రాఫిక్ సీఐ శాంతిలాల్, పులివెందుల టౌన్ ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, తిమోతి, వేముల ఎస్ఐ ప్రవీణ్, తొండూరు ఎస్ఐ మద్దిలేటి, లింగాల ఎస్ఐ జగదీష్, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్, ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ శ్రీప్రియ తో పాటు సుమారు 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా నగిరిగుట్ట ప్రాంతం లోని ఇళ్లలో అక్రమ కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలు, గంజాయి, నాటు సారా వంటి అక్రమ వస్తువులపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో గంజాయి మరియు నాటు సారా విక్రయాల్లో పాల్గొన్న వ్యక్తుల ఇళ్లలో కూడా పోలీసులు సోదాలు చేపట్టారు.తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 41 మోటార్ సైకిళ్లు మరియు 2 ఆటోలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతా యని పోలీసులు పేర్కొన్నారు.

మండలంలో ఫుడ్ కమీషన్ చైర్మన్ విస్తృత తనిఖీలు:

చిన్నమండెం మార్చి 07 ప్రభాతవార్త:

మండలంలో శనివారం రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి విస్తృతంగా పర్యటించి వివిధ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, రేషన్ షాపులు మరియు మండల స్టాక్ పాయింట్ ను తనిఖీ చేయడం జరిగింది.వీరి పర్యటనలో కేజీబీవీ పాఠశాలను సందర్శించి వంట సరుకులు,కూరగాయలు విద్యార్థినులకు అందిస్తున్న భోజన వివరాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు మంచి భోజనం మెనూ ప్రకారం అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించడం జరిగింది.తదనంతరం మండల కేంద్రము లోని వివిధ అంగన్వాడీ కేంద్రాలు,రేషన్ షాపులు సందర్శించి స్టాక్ వివరాలు పరిశీలించడం జరిగింది.తదనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి వండిన భోజనాన్ని రుచి చూసి రికార్డులను పరిశీలించడం జరిగింది.ఈ పర్యటనలో వీరి వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

అంగళ్లు, రాయచోటిలో కార్డన్ అండ్ సెర్చ్

మదనపల్లె క్రైమ్, మార్చి 7 ప్రభాతవార్త.

అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు శనివారం ఉదయం పోలీసులు"ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా మెరుపు దాడులు నిర్వహించారు. రాయచోటి, మదనపల్లి రూరల్ అంగళ్ళు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుండే భారీ కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టారు. నేరగాళ్ల కదలికలు, ఖాళీ భవనాలు, నిర్మానుష్య ప్రదేశాలను డ్రోన్ల కెమరాలతో వీడియో రికార్డింగ్ చేస్తూ తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ నేతృత్వంలో రాయచోటి పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. రూరల్ సీఐ రవి నాయక్ పర్యవేక్షణలో అంగళ్లు ముదివేడు, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డులతో కలిపి 10 ప్రత్యేక బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను, ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. పాత నేరస్థులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా తీశారు. గంజాయి, డ్రగ్స్, కూల్‌లిప్స్, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసులు మత్తు పదార్థాల హానిపై అవగాహన కల్పించారు. గోడ పత్రికలను అతికించి, ప్రజలందరితో "నాశముక్త్ భారత్ అభియాన్" ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు రెవెన్యూ అధికారులు, జిల్లా ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులు ఆపరేషన్ వజ్రప్రహార్ మెగా కార్డన్ అండ్ సెర్చ్

మైదుకూరు, మార్చి 07, ప్రభాతవార్త:

అర్బన్ సిఐ రమణా రెడ్డి ఆధ్వర్యములో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ వజ్రప్రహార్ లో శనివారం రోజు మెగా కార్డన్ మరియు సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు. నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టబడ్డాయి. ఈ మెగా కార్డన్ మరియు సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 85 మంది పోలీసు అధికారులు తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు,వాహనాల వివరాలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 100 మంది వ్యక్తులను తనిఖీ చేశారు. 50 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 5 మోటర్ సైకిళ్ళు మరియు 2 ఆటోలు వాహనాలను గుర్తించారు. మొత్తం 7 (2+3+4 వీలర్) వాహనాలను సీజ్ చేశారు. రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్ లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారికీ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిన ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

బోయినపల్లిలో ఆపరేషన్ వజ్రప్రహార్

రాజంపేట,మార్చి 7 ప్రభాతవార్త.

రాజంపేట మండలం కొత్త బోయినపల్లిలో ఏఎస్పీ మనోజ్ రామ నాథ్ హెగ్డే ఆపరేషన్ వజ్రప్రహార్ ఖిచేపట్టారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులుతో కలిసి ఏఎస్పి, మన్నూరు సిఐ లింగప్ప, ఎస్సై ఎం వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా మాదకద్రవ్యాల నివారణలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక యూనివర్సిటీలో చదివే విద్యార్థులు వేలాదిగా ఇక్కడ నివాసం ఉంటున్నారు.వారి గదుల్లో పోలీసులు తనిఖీలు చేశారు. రూముల్లోవున్న బీరు,మద్యం సీసాలను చూసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకుదూరంగా ఉండాలని సలహా ఇచ్చారు. రౌడీ పీటర్లను ప్రశ్నించారు. హాస్టల్స్ నిర్వాహకులను కఠినంగా ఉండాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 55 మందిని వ్యక్తిగతంగా విచారించారు. వాహనాలు తనిఖీ చేశారు. 15వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మనోజ్ రామనాథ హెగ్డే మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆపరేషన్ వజ్రప్రహార్ నిర్వహించామన్నారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించామన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు

మహిళా దినోత్సవ కానుకగా హెచ్‌పీవి వ్యాక్సిన్

పీలేరు మార్చి 07 ప్రభాతవార్త:

మహిళా దినోత్సవ కానుకగా కూటమి ప్రభుత్వం మన ఆంధ్రప్రదేశ్ లో మహిళలలో గర్భాశయ ముఖా ద్వార క్యాన్సర్ రాకుండా నివారించేందుకు 14సంవత్సరాలు పూర్తి చేసుకుని 15సంవత్సరాల మధ్యలో ఉన్న బాలికలకు హెచ్. పీ. వి. వ్యాక్సిన్ ఒక డోస్ అందిచనుందని పీలేరు మండల ప్రజారోగ్య నర్సింగ్ అధికారిని మరియు అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మహిళా అధ్యక్షురాలు కుసుమ తెలిపారు. మండల కేంద్రం లోని పీలేరు కోటపల్లి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో డి. ఎమ్. హెచ్. ఓ. ఆదేశాల మేరకు తలపుల వైద్యులు డాక్టర్ గిరీష రెడ్

అగ్రహారంలో మెరిసిన ఆణిముత్యం

సివిల్స్‌లో 923ర్యాంకు పొందిన రాజశేఖర్ .. కలెక్టర్ కావాలన్నదే ధ్యేయంగా రాణింపు

రాజశేఖర్,అక్కా బావలతో రాజశేఖర్

నిమ్మనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం అగ్రహారానికి చెందిన ఓ నిరుపేద ఎస్‌టి కులానికి చెందిన గోగుల రాజశేఖర్ సివిల్స్‌లో 923వ ర్యాంకు సాధించి పలువరికి ఆదర్శంగా నిలిచాడు. మారుమూల అగ్రహారంలో ఆణిముత్యంలా మెరిసి దేశంలోనే పేరు ప్రఖ్యాతలు పొందాడు. అతనికి ఏడాది వయస్సులోనే తల్లిదండ్రులు గరుడప్ప, రాణిమ్మ అనారోగ్యంతో చనిపోయారు. మేనమామ వెంకటనారాయణ, అక్క క్రిష్ణవేణి చొరవ తీసుకొని రాజశేఖర్‌ను నిమ్మనపల్లె జిల్లా పరిషత్ స్కూల్‌లో 10వరకు చదివించారు. ఇంటర్‌లో 979మార్కులతో పాటు ఈఈఈ అడ్వాన్స్‌లో జాతీయస్థాయిలో 282వ ర్యాంకు సాధించాడు. ఒడిస్సాలోని భువనేశ్వర్ ఐఐటిలో ఇంజనీర్ సీటు వచ్చినా ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. కూలి పనులకు వెలుతున్న రాజశేఖర్ కష్టాలపై గతంలో వార్తలో కథనం ప్రచురణం కాగా దాతలు మదనపల్లె పట్టణంలోని ప్రముఖ టిడిపి నాయకుడు బోడిపాటి శ్రీనివాసులు వీరి తండ్రి కాంట్రాక్టర్, వైద్యులు లయన్స్ భాస్కర్‌నాయుడు సహాయసహకారాలతో ఉన్నత విద్యకు వారు సహాయ సహకారాలు అందించారు. అతని చదువుల కోసం అక్కా, మామ నిమ్మనపల్లె మండలంలో అగ్రహారం పూర్తిగా వదిలివేసి పొట్టకూటికోసం బెంగుళూరు చేరి కూలిపనులు చేస్తూ కొంత వరకు నగదును రాజశేఖర్‌కు పంపేవారు. ఢిల్లీలో సివిల్స్ శిక్షణ తీసుకునే సమయంలో డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో రాజశేఖర్ పేపర్ బాయ్‌గా, పిల్లలకు ట్యూషన్లు చెప్పి చదువును కొనసాగిస్తూ వచ్చాడు. మొత్తంగా 4వ పర్యాయం సివిల్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి శనివారం ప్రభాతవార్తతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ సివిల్స్‌లో రాణించి పేరు పొంది పలువురికి ఆదర్శంగా నిలవడమే తమ ధ్యేయమన్నారు. కలెక్టర్ కావాలనే ధ్యేయంగా కష్టపడి చదివానన్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కల్పోవడంతో మేనమామ దాతల సాయంతో ఈ స్థాకియి చేరుకొన్నాను కాబట్టి పదిమందికి సాయం చేసే స్థానానికి ఎదగాలన్నదే తమ చిరకాల కోరిక అన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : పట్టణం సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్ అయిన ప్యూజన్ 2కె-26 శనివారం ముగిసింది. ముఖ్య అతిధిగా జేఎన్‌టియు డైరెక్టర్, ప్రొపెసర్ నాగప్రసాద్ నాయుడు విచ్చేసి విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించడంలో సంస్థ చేసిన కృషిని అభినందించారు. రెండవ రోజు హ్యాక్‌స్ట్రీట్, టెక్ తంబోలా, పేపర్ ప్యూజన్, డ్రోన్ ప్రదర్శనపై వర్క్‌షాపుతో సహా అనేక సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు తమ సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను ప్రదర్శించడానికి సదస్సు వేధికగా నిలిచింది. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి విజేతలను, నిర్వాహకులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాముడు విద్యార్థులను, అధ్యాపకులును అభినందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఎస్.మునిరత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుదల ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డిమాండ్

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : వంటగ్యాస్ సిలిండర్‌కు రూ.60లు, వాణిజ్య సిలిండర్‌కు రూ.115లు కేంద్ర ప్రభుత్వం పెంచడాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి, రష్యానుంచి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షల నేపధ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై భారం మోపుతుందన్నారు. యుద్ధాన్ని నిలుపదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. యుద్ధం ఇదే విధంగా కొనసాగితే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సామాన్యప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సిలిండర్ ధర పెరగడం వల్ల చిరు వ్యాపారులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తొందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న కూటమి ప్రభుత్వం కూడా గ్యాస్ ధర పెంపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ధరలు తగ్గించకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మదనపల్లె ఉర్దూ కవికి ఉర్దూ పురస్కారం

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన మదనపల్లె ఉర్దూ కవి డాక్టర్ ఎస్‌కె.బాషాకు శనివారం ఉర్దూ పురస్కారంతో సత్కరించారు. ఇందులో భాగంగా జిల్లా విద్యాశిక్షణ సంస్థలో జరిగిన ల్యాంగ్వేజ్ పెస్టివల్‌లో వారికి సమగ్ర శిక్షణా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ అనూరాధ, డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మదతాటి నరసింహారెడ్డిలు ఉర్దూ కవికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఉర్దూ కవి డాక్టర్ ఎస్‌కె. బాషా మాట్లాడుతూ తాను రెండున్నర దశాబ్దాలకు పైగా ఉర్దూ భాషాభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్నారు.

చైతన్య సంస్థలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : పట్టణ సమీపంలోని చైతన్య సర్వీస్ సొసైటి సంస్థలో శనివారం ముందస్తు 50వ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళా ప్రముఖులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు రాధిక, గ్రామజ్యోతి సొసైటి సుబద్ర, సబ్ఇన్స్‌పెక్టర్ గాయత్రి మహిళా దినోత్సవేడుకల్లో భాగంగా సన్మానాలు అందుకొన్నారు. చైతన్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి.ఆనందన్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, సంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణిలు వారికి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మహిళలకు ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బడికాయలపల్లె నరసింహస్వామి ప్రతిష్ట

టిటిడి ఆధ్వర్యంలో వైభవంగా ఏర్పాట్లు

బి. కొత్తకోట మార్చి 7 ప్రభాతవార్త బి. కొత్తకోట మండలం బడికాయలపల్లె సమీపంలోని గొల్లలచెరువు కట్ట పై పురాతన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గత 400 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు స్థానిక భక్తులతో పాటు కర్ణాటక భక్తులు రూ 19.40 లక్షలు టిటిడికి డిపాజిట్ చేయగా టిటిడి రూ 77.60 లక్షలు మంజూరు చేసింది. ఆలయ జీర్ణోదరణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన స్వామి సారధ్యంలో బడికాయలపల్లి, గురికానిపల్లి, చేదురాయునిపల్లి, వలస గుట్ల పల్లెలకు చెందిన వందలాదిగా మహిళలు,గ్రామస్తుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని గత రెండేళ్లుగా వరి ధాన్యం లో ఉంచి ఉదయం విగ్రహంతో పాటు కలశం గంగ తీర్థం గొల్లలచెరువు ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి జలాభిషేకం చేపట్టారు.ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం రామానుజాచార్యులు శిష్యులు అర్చకత్వంలో వైభవోపేతంగా కుంకుమార్చనలు, హోమం, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి పై నాలుగు గ్రామాల ప్రజలు తో పాటు కర్ణాట బి.కొత్తకోట భక్తులు పెద్ద ఎత్తున పూజాకార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూత పిందెను సంరక్షించుకోవాలి

జిల్లా ఉద్యాన అధికారి సతీష్

నందలూరు, మార్చి 7, ప్రభాత వార్త: పూత బాగా వచ్చినప్పటికీ సరిగా పిందె కట్టలేదని ఉన్న పూత పిందెను సంరక్షించుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి సతీష్ సూచించారు. మండల ఉద్యాన అధికారి సునీల్ తో కలిసి ఆయన ఆడపూరు గ్రామంలో మామిడి లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం కొన్నిచోట్ల పిందె రాలుతుందని రైతులు చెప్తున్నారని. అందుకు గాను ప్లానోఫిక్స్ రెండున్నర మిల్లీలీటర్లుకు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పూత మాడిపోతుందని, బంక ఎక్కువగా ఉందని దీని నివారణకు టాటా కంపెనీ ఒడిస్ మందును ఒక గ్రాము లీటర్ నీటికి, లేదా సింగెంటా వారి చెస్ మందును 0.6 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఎక్కడైనా నల్ల తామర పురుగులు కనిపిస్తే వేప నూనె 2 ఎం.ఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు చెప్పారు. అలాగే నిమ్మకాయ దశలో ఉన్న మామిడికి కవర్లు తొడగడం వల్ల మంచి నాణ్యతతో కూడిన పండ్లను ఉత్పత్తి చేయవచ్చని తద్వారా మెరుగైన ధరలు సాధించవచ్చని సూచించారు. ఉద్యాన అధికారి సునీల్ మాట్లాడుతూ పండ్ల కవర్లు రాజంపేట ఉద్యాన ఆఫీస్ లో అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యాన సహాయకురాలు విజయ కుమారి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ లైన్ మెన్ దినోత్సవం

పులివెందుల,మార్చి 7, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తుపంపిణీ సంస్థ ఏపీ ఎస్పీడీసీఎల్ జాతీయ లైన్మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ ఆవరణలో ఉన్న విద్యుత్తు ప్రజా కళా వేదిక వద్ద శనివారం జాతీయ లైన్మెన్ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈ ఈ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తమ చేతుల మీదుగా నిర్వహించడం చాలా సంతోషకరమని ముఖ్యంగా ఫీల్డ్ లో లైన్మెన్లు నిరంతరం అహర్నిశలు కష్టపడుతూ 24 గంటలు స్వచ్ఛమైన కరెంటును ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇవ్వడం జరుగుతుందని చాలా సంతోషకరమని ఆలాగే ప్రతి ఒక్క లైన్మెన్ కూడా విధులు నిర్వహించేటప్పుడు కచ్చితంగా సేఫ్టీ పరికరాలు ఉపయోగించుకొని తగు జాగ్రత్తలు తీసుకొని అలాగే ఎల్ సి తీసుకున్నప్పుడు ఒకటికి రెండుసార్లు ఫీడర్ చెక్ చేసుకుని సప్లై ఉన్నదా లేదా అని సమాచారం తెలిసిన తర్వాతే పోల్ ఎక్కి పనిచేయాలని ఈనియమాన్ని కచ్చితంగా ప్రతి ఒక్కరు పాటించవలసినదిగా తెలిపారు. అనంతరం పులివెందుల డివిజన్ సంబంధించి 2026 సంవత్సరం బెస్ట్ లైన్మెన్లుగా ఆనంద్ రెడ్డి, బాబావల్లి, బాల నరసింహులు, వేణుగోపాల్ లకు ప్రసాద్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడీఈ గురు మోహన్ రెడ్డి, ఏడి సుధాకర్ రెడ్డి, ఏఈలు రమేష్ రెడ్డి, రమేష్ , వేణుగోపాల్, సబ్ ఇంజనీర్లు, లైనింగ్, ఇన్స్పెక్టర్లు ,లైన్మెన్లు, ఏఎల్ఎం, జేఎల్ఎం లో, ఈఆర్ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తను అరెస్ట్ చేయాలంటూ కుటుంబ సభ్యులు నిరసన

మదనపల్లె క్రైమ్, మార్చి 7 ప్రభాతవార్త. మద్యం మత్తులో భార్యపై దాడి చేసిన భర్త పవన్ కళ్యాణ్ ని అరెస్ట్ చేయాలంటూ శనివారం బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి మదనపల్లి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు. మదనపల్లె పట్టణం చిప్పిలిలో నివాసం ఉంటున్న ఉమాదేవి కుమార్తె శ్రావణికి, కుమారపురానికి చెందిన పవన్ కళ్యాణ్ తో వివాహమైంది. పవన్ కళ్యాణ్ మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. మూడు రోజుల క్రితం మద్యం తాగడానికి శ్రావణి డబ్బులు ఇవ్వలేదని ఇటుక రాళ్లతో ఆమె తలపై కొట్టి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆటో నడుపుతూనే గుండెపోటుతో మృతి చెందిన డ్రైవర్

మదనపల్లె క్రైమ్, మార్చి 7 ప్రభాతవార్త. నిత్యం కష్టపడి కుటుంబాన్ని పోషించే ఓ ఆటో డ్రైవర్, విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచారు. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. మదనపల్లి పట్టణంలోని కోటవీధికి చెందిన లక్ష్మణరావు ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఆయన ఒక ఇంటి సామాగ్రిని బాడుగకు ముదివేడుకు తరలించేందుకు తన ఆటోలో బయలుదేరాడు. మార్గమధ్యంలో కురబలకోట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద లక్ష్మణరావుకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆటోలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకొని అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో లక్ష్మణరావు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్య కుటుంబానికి చెందిన లక్ష్మణరావు మరణం పట్ల తోటి ఆటో డ్రైవర్లు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై ప్రాథమిక సమాచారం సేకరిస్తున్నారు.

జగనన్న కాలనీలో గృహాల నిర్మాణంలో లోపాలు

రాంక్రిట్ సంస్థపై కేసు నమోదు

పులివెందుల , మార్చి 7 , ప్రభాత వార్త : పులివెందులలో జగనన్న కాలనీలో ఒప్పందం ప్రకారం గృహాలు నిర్మించలేదనే ఆరోపణలతో రాం క్రిట్ సంస్థపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో జగనన్న కాలనీలో పేదల కోసం గృహ నిర్మాణ పనులు చేపట్టేందుకు రాం క్రిట్ సంస్థకు కాంట్రాక్ట్ ఇవ్వబడింది. అయితే ఒప్పందం ప్రకారం నిర్దేశిత గడువులో గృహాలను నిర్మించకపోవడం, పనులు పూర్తి చేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు సంస్థపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇక పోతే గృహ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించలేదని, నిధుల దుర్వినియోగం జరిగిందని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వారు వెల్లడించారు.

మండల కేంద్రంలో ఘనంగా మహిళా దినోత్సవం

రామసముద్రం, మార్చి 7 ప్రభాతవార్త రామసముద్రం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామసముద్రం ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హేమలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ఒకవైపు కుటుంబ భారాన్ని మరోవైపు ఉపాధ్యాయ వృత్తి భారాన్ని మోస్తూ మహిళలు ఎంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రామసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు ఎస్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి మండల అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ప్రధాన కార్యదర్శి రమాదేవి , యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత మాట్లాడుతూ రామసముద్రం మండలంలో అత్యధిక సంఖ్యలో మహిళా ఉపాధ్యాయుల పని చేస్తున్నట్లు తెలిపారు. మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వర్గీయ ఎస్టియు రాష్ట్ర నాయకుడు టివి రెడ్డి సతీమణి రజిని మండల విద్యాశాఖ మరియు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలో మంచి సర్వీస్ అందజేస్తున్న ఎంఈఓ హేమలత జిల్లా యు టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఉపాధ్యాయురాలు తూర్పు పాఠశాలప్రధాన ఉపాధ్యాయరాలు కె. హేమలత,తిరుమల్ రెడ్డి పల్లి ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి దేవి గొల్లపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాహిర కు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు నరసింహులు, సురేష్ జిల్లా మహిళా కన్వీనర్ కుసుమ మండల కన్వీనర్ రాధమ్మ అధిక సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన తరువాతే ఛలో ఢిల్లీ

మదనపల్లె, మార్చి 7 ప్రభాతవార్త : పట్టణ సమీపంలో ఉన్న బుద్దిని కొండ పరిరక్షణ కోసం ఈనెల 10న ఛలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన బౌద్దుల ఆత్మగౌరవ దీక్షను ప్రముఖ బౌద్ద ఉపాసకుల సూచనల మేరకు వాయిదా వేయడం జరిగిందని కమిటీ కన్వీనర్ పిటిఎం శివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసిన తరువాతనే చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతామన్నారు. బుద్దిని కొండ పరిరక్షణపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి అక్కడపరిష్కారం లభించకపోతే ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

సామాజిక సమానత్వం మహిళల హక్కు

మైదుకూరు, మార్చి 07, ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా సమాజంలోని వివిధ రంగాలలో తమ ప్రతిభతో రాణిస్తున్న మహిళా మణులను ఎస్టియు కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక కడప రోడ్డు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవ సన్మాన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మహిళా సాదికారత దిశగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక అయిన పాలకులు చిత్తశుద్ధిగా ప్రయత్నం చేయాలని బాలికలు నేటి సమాజంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఈ సమాజంలోని ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ, వాణిజ్య, సాఫ్ట్ వేర్, పోలీసు రక్షణ రంగాల్లో కూడా నేడు మహిళలు అద్వితీయంగా రాణిస్తున్నారని వారందరినీ స్ఫూర్తిగా తీసుకొని నేటి బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రులు కలలు కన్న స్థాయికి చేరుకోవాలని కోరుతూ 21వ శతాబ్దంలో కూడా ఇప్పటికీ బాలికలకు మహిళలకు రక్షణ లేని సమాజం నేడు బాధ కలిగిస్తుందని బాలికలపై మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయడానికి కఠినమైన చట్టాల ద్వారానే సాధ్యమవుతుందని అన్నిటి కంటే ముందు వారికి సమానత్వం అనేది మాటల్లో పుస్తకంలో కాకుండా ఆచరణలో చూపాలని చట్టసభల్లో నుంచి పంచాయతీల వరకు వారికి రాజకీయ ప్రాధాన్యత కూడా కల్పించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డిగ్రీ కాలేజ్ అధ్యాపకుడు నారాయణరెడ్డి, హెడ్ మిస్ట్రెస్ కవిత, లెక్చరర్ లక్ష్మి భాయి, బ్యాంక్ అధికారులు షర్మిల, సృజన రెడ్డి, ఎస్టియు నాయకులు చంద్రశేఖర్,వెంకటేశ్వర్లు, సూర్య నారాయణ రెడ్డి,రమణయ్య,సురేష్, శ్రీదేవి, నరసింహరాజు, విజయుడు, విజయ్, సురేంద్రనాయక్, రామతీర్థప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

లక్కిరెడ్డిపల్లి: మార్చి 07 ప్రభాతవార్త నేడు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు లక్కిరెడ్డిపల్లి మండల వ్యాప్తంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని లక్కిరెడ్డిపల్లె విద్యుత్తు శాఖ ఏఈ హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి వేంపల్లి రహదారిలోని సురకవాండ్లపల్లి వద్ద ఉన్న 132/33 కెవి విద్యుత్తు ఉపకేంద్రంలో బ్రేకర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గౌతమి మహిళా కళాశాల విద్యార్థినిల ర్యాలీ

ప్రొద్దుటూరు,మార్చి 7 ప్రభాతవార్త : ప్రొద్దుటూరు మండల పరిధిలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రాజీవ్ సర్కిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు ఈ ర్యాలీలో భాగంగా విద్యార్థులు సమాజంలో నేడు మహిళలకు జరుగుతున్న అన్యాయాలను అఘాయిత్యాలను వివరిస్తూ మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని తెలిపారు. మహిళలకు గౌరవం సమాజానికి అభివృద్ధి మహిళలు ముందుకు దేశం ముందుకు మహిళా సాధికారతే నిజమైన స్వాతంత్రం లాంటి నినాదాలతో ర్యాలీ ముందుకు కదిలింది అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రవీంద్రారెడ్డి కరస్పాండెంట్ బాబమ్మ కో డైరెక్టర్ సొల్యూషన్ డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ మరియు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ వి సుజాత పూజిత ఎన్ఎస్ఎస్ కన్వీనర్ కె స్వరూప్ వివిధ విభాగధిపతులు ఆలీ సుకుమార్ జబీర్ లావణ్య మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా గుర్తింపు ఇచ్చిన పాఠశాలకు విద్యార్థులు సాయం

సుండుపల్లె,మార్చి 07,ప్రభాతవార్త : సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదే పాఠశాలకు క్రీడాపరికరాలు వితరణగా అందజేశారు. పాఠశాలలో విద్యను కొనసాగిస్తూ ప్రస్తుతం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్న నంద్యాల బేబి, కొడన వెంకటేశ్వర్లు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. సాఫ్ట్ బాల్ క్రీడలో రెండేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబరచిన నంద్యాల బేబి సాఫ్ట్ బాల్ అసోసియేషన్ క్రీడాలలో ఒక సారి,ఎస్ జి ఎఫ్ ఐ అండర్ 17,అండర్ 19 విభాగాలలో రెండు సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. కొడన వెంకటేశ్వర్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్, ఎస్ జి ఎఫ్ ఐ ద్వారా రెండు సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు.దీంతో తమకు క్రీడల ద్వారా గుర్తింపు ఇచ్చిన పాఠశాలకు తమ వంతు సాయంగా ఆ ఇద్దరు విద్యార్థులు పది వేల రూపాయలు విలువ చేసే సాఫ్ట్ బాల్ గ్లౌ లను పాఠశాల ప్రధానోపాధ్యాయిలు షాకీరా బేగం , ఫిజికల్ డైరెక్టర్ రాధా రాణి, ఉపాధ్యాయులకు అందజేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యం

బద్వేల్ అర్బన్ మార్చి 07 ప్రభాతవార్త :

ప్రభుత్వ పాఠశాలలు లేకపోతే పేదలకు నాణ్యమైన విద్య అందదని, తద్వారా పేదల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. శనివారం సాయింత్రం బద్వేల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కార్యదర్శి కె. సుధాకర్ అధ్యక్షతన "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాంఊరి బడిని కాపాడుకుందాం" అనే అంశంపై ప్రాంతీయ సదస్సు ను నిర్వహించారు. ఈ సదస్సు కు ముఖ్య అతిథులుగా హాజరైన మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలిస్తున్న పాలకవర్గాలు తీరా గద్దినెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. వివిధ యాప్‌ల పేరుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేయడంలో పాలకవర్గాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సాల్ట్ పథకం అమలులో భాగంగా ప్రపంచ బ్యాంకు నుండి 1750 కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం వారితో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను కుదించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు "ప్రభుత్వ బడిలో విద్యార్థుల ను చేర్పిద్దాంఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ ఆధ్వ ర్యంలో ఫిబ్రవరి మాసం నుండే ప్రభుత్వ బడుల్లో ఎన్రోల్మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నాలుగు దశలుగా నిర్వహించాలని, నిర్ణయించామని ఆ మేరకు మొదటి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించామని, రెండవ దశలో మండల స్థాయి సమావేశాలు, మూడవ దశలో ఇంటింటి ప్రచా రం చేపట్టనున్నామని, నాలుగవ దశలో ప్రజా సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.గోపీనాథ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ వీరదాసరి క్రిస్టఫర్, ఐక్య ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ టి.శివప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, సి.కంచి రెడ్డి, సహాధ్యక్షుడు వై.రామయ్య, ట్రెజరర్ ఎ.లాజరస్, గోపవరం మండల ప్రధాన కార్యదర్శి ఎం.రామచంద్రయ్య, ట్రెజరర్ బి.ఓబన్న, సహాధ్యక్షుడు వై.వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహులు, కొండయ్య, మహమ్మద్ గౌస్, ఆర్.రమణ, బాల ఓబన్న, ప్రసాద్, ఆర్. రాజా, ఎం.గుర్రయ్య, కె.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు సరికాదు

బద్వేలు, మార్చి 7, ప్రభాతవార్త

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేపడుతున్న దాడులు ప్రపంచ శాంతికి పెను ముప్పుగా మారాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం బద్వేల్ పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేపడుతున్న చర్యలు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమన్నారు. పాలస్తీనా ప్రాంతంలో కొనసాగుతున్న మారణకాండకు అమెరికా మద్దతు ఇస్తోందని ఆరోపించారు. వియత్నాం నుంచి ఆఫ్ఘనిస్తాన్ వంకు అమెరికా జోక్యం చేసుకున్న ప్రతి దేశంలో ప్రజల ప్రతిఘటన చరిత్ర ఉందని, సామ్రాజ్యవాద శక్తులు ప్రజల శక్తిని ఎప్పటికీ జయించలేవన్నారు. భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో అమెరికా-ఇజ్రాయిల్ చర్యలను ఖండించి, అలీన విదేశాంగ విధానానికి కట్టుబడి ప్రపంచ శాంతికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ బి. అనిల్ కుమార్, సీపీఐ(ఎంఎల్) బద్వేల్ ఏరియా కార్యవర్గ సభ్యులు కే. బాబు, జయరామరాజు, గంటా మహబూబ్ బాషా, చంద్రపాల్, నారాయణ, పట్టణ కమిటీ నాయకులు గుర్రప్ప, దారా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సంరక్షణకు బాధ్యత వహించాలి

ప్రొద్దుటూరు మార్చి 7 ప్రభాతవార్త

రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న మహిళలపై హింస అత్యాచారాలను అరికట్టడానికి మహిళల హక్కులు పరిరక్షించడానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ డిమాండ్ చేశారు శనివారం చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వేదవ్యాస డిగ్రీ కళాశాలలో కాలేజీ విద్యార్థినిల్లో ఒత్తిళ్ల వేధింపులు, హింసను ఎదుర్కోవడం పై ఆత్మస్థైర్యం పెంపొందించే మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలకు కాగితం మీద ఉన్న హక్కులు నిజజీవితంలో అమలు కావాలని ఆ బాధ్యత ప్రభుత్వాలదని ఐక్యరాజ్యసమితి నొక్కి చెప్పింది అన్నారు. ఉపాధ్యాయురాలు సోఫియా మాట్లాడుతూ డిగ్రీలు బీటెక్లు ఎంటెక్లు పీహెచ్డీలు చేసిన వారికి ఈ దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాల ఉద్యోగాలు కల్పించడం చేతకాలేదు అన్నారు కానీ ఇంకా ముగ్గురు పిల్లలు కానీ జనాభాను పెంచమని చెప్పే దౌర్భాగ్యపు నేతలు ఉండడం దారుణమన్నారు. అనంతరం విద్యార్థినిలు తాను ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేశ్వర్ రెడ్డి లెక్చరర్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలు పరిష్కారం జెండర్ రిసోర్స్‌సెంటర్

సుండుపల్లి, మార్చి 07,ప్రభాతవార్త:

మండలంలోని శ్రీ శక్తి భవనంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న జెండర్ రిసోర్స్ సెంటర్‌ను టీడీపీ మండల అధ్యక్షులు రమేష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ కలహాలు, వివాదాలు వంటి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందకపోయిన సందర్భాల్లో జెండర్ రిసోర్స్ సెంటర్ ద్వారా ప్రజలకు సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు మరియు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో విద్యార్థి దుర్మరణం

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 7, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని నడింపల్లి హైస్కూల్లో 5వ తరగతి చదువుతున్న షేక్ మస్తాన్ వల్లీ మధ్యాహ్నం భోజనం తినే సమయంలో ఫిట్స్ రావడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులు అతని చేతిలో ఇనుప వస్తువులు ఉంచినా ఫిట్స్ తగ్గలేదు. వెంటనే బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె తల్లి వచ్చే సరికి 20 నిమిషాలు సమయం అయ్యింది. బాలుడిని, అతని తల్లి ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అంత సేపు మూర్ఛ వచ్చి అలాగే ఉంటే ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్ కానీ ఎవరూ స్పందించకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరు మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

సమాజంలో,కుటుంబంలో మహిళల పాత్ర కీలకం

కడప కార్పొరేషన్ మార్చి 7 ప్రభాతవార్త:

ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకం అని జిల్లా శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి. రమాదేవి అన్నారు. ఆమె కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె మహిళలు మరిన్ని రంగాల్లో రాణించాలని, అభద్రత భావాన్ని విడనాడాలని, ధైర్యంగా ముందుకు దూసుకెళ్ళి తమ సత్తా చాటాలని తెలిపారు. ప్రిన్సిపాల్ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించి వాటిని అరికట్టాలనికోరారు. కరెస్పాండెంట్ రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఎంతో శక్తి మంతులని తెలిపారు.ఆ తర్వాత మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతి ప్రధానం జరిగింది. ఆ తర్వాత మహిళలకు కొన్ని పోటీలు నిర్వహించారు. తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలోఅన్ని శాఖల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో కూలీలకు పనులు కల్పించాలి

చౌడేపల్లి, మార్చి 7 ప్రభాతవార్త

కార్యక్రమంలో అధికారులు నాయకులు

వేసవిలో కూలీలకు పనులు కల్పించాలని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), ఎంపిడిఓ లీలా మాధవిలన్నారు. శనివారం స్థానిక పరిపాలనా భవనంలో మండలస్థాయిలో జీరామ్‌జీ పనులపై ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ సూచనల మేరకు వేసవిలో కూలీలు వలసలు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతాశయంతో కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నారనీ, పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా భూగర్భ జలాలు అభివృద్ధి చెందే పనులు, శాశ్వత ఫలితాలిచ్చే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా పనులను పర్యవేక్షించారు. తేదేపా సీనియర్ నాయకులు పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్, ముని, ప్రభాకర్, మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించడం హర్షించదగ్గ విషయం

లక్కిరెడ్డిపల్లి: మార్చి 07 ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాలలో అగ్రగామిగా రాణించడం హర్షించదగ్గ విషయమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వరాల రమేష్ పేర్కొన్నారు. జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో మహిళా ఉపాధ్యాయురాలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమిత కాకుండా అన్ని రంగాలలో అగ్రగామిగా ముందుకు దూసుకెళ్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రపంచంలోనే మహిళ ఒక గొప్ప శక్తి లాగా ఇటు కుటుంబాన్ని అటు తన ఎంచుకున్న తన ఉద్యోగానికి న్యాయం చేస్తూ అన్నిటిలోనూ ముందంజలో ఉన్నారన్నారు. ప్రపంచంలో ఎంతోమంది మహిళామణులు మేధావులు, విజ్ఞాన జ్ఞాన సంపన్నులు ప్రతి వ్యవస్థలోనూ ఉన్నారన్నారు. సివిల్స్, గ్రూప్ వన్, గ్రూప్ టు ఫలితాలలో ఎంతో మంది ఐఏఎస్ ఐపీఎస్ రంగాలలో ముందంజలో ఉన్నారన్నారు. గతంలో మహిళలంటే కేవలము ఇంటికే పరిమితమయ్యేవారు. కానీ ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ యుగములో స్త్రీలు ఎంతో గొప్ప మేధా సంపన్నులుగా ఎదుగుతున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివ శంకర్ రెడ్డి, అధ్యాపకులు రాజ శేఖర్, మహిళా ఉపాధ్యాయురాలు వాసవి, మంజు, ప్రవీణ, శ్రీ లీల, అర్చన, పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

పులివెందుల, మార్చి 07, ప్రభాతవార్త :

115వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని పులివెందుల మున్సి పాలిటీలోని కె.వెలమవారిపల్లి వార్డు సచివాలయంలో శనివారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సచివాలయ ఇన్‌చార్జి అడ్మిన్ కె. నాగలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సేవలనుకొనియాడారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్యదర్శులు ఎస్. పర్వీన్ బేగం (మహిళా సంక్షేమ కార్యదర్శి), దూస లక్ష్మి (ఏఎన్ఎం), బండి లక్ష్మి (శానిటరీ కార్యదర్శి)లను సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఆర్వో ఎస్. మాస్సుమ్ బాషా, డీఈ కిరణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఏపిఎండి. ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు సచివాలయ సిబ్బంది జి. గణేష్, ఎస్. బాబు, ఎస్. అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొని మహిళా ఉద్యోగుల కు సంఘీభావం తెలిపారు.

10వ తేదీ లోపు వేతన పెంపు ప్రకటించాలి

వేంపల్లె:మార్చి 07(ప్రభాత వార్త)

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా నాయకులు వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ లోపు ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే 11 నుంచి దశల వారీ ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా, జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, నియోజకవర్గ ఏరియా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తేదీ లోపు వేతనాల పెంపు ప్రకటన చేయకపోతే, 11 నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపడతామని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ కార్మికులకు 2019 నుంచి వేతనాలు పెరగలేదని, 2024 జూన్ నుంచి జీతాలు పెంచడానికి ప్రభుత్వం యూనియన్లతో ఒప్పందం చేసినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని సూచించారు. 1,800 మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చడం, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయడం వంటి సమస్యలు ఇంకా పరిష్కారం పొందలేదని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకురాలు సరస్వతి, శైలజ, భాగ్యలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్‌ను దూరంగా తరలించాలని వినతి

బద్వేలు అర్బన్ మార్చి 07 ప్రభాతవార్త :

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బద్వేల్ పురపాలక సంఘ పరిధిలో సేకరించిన చెత్తను డంపు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా తరలించి ప్రజల ప్రాణాలను పర్యావరణాన్ని కాపాడాలని బద్వేల్ పురపాలక సంఘ అకౌంటెంట్ నాగేంద్ర, సీనియర్ అసిస్టెంట్ రమణయ్యలకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మున్సిపాలిటీ సిబ్బంది సేకరించి రూపరాంపేట శివాలయం,నిత్యం స్కూలు విద్యార్థులు ఉన్న కృష్ణ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్, 18వ వార్డు సుందరయ్య కాలనీకి సమీపాన డంపు చేసిన పెద్ద పెద్ద వ్యర్థాల కుప్పల ద్వారా భరించలేని దుర్వాసన వస్తున్నడం, వ్యర్థాల కుప్పలకు నిప్పు పెట్టడంతో దగ్గరగా నివాసాలున్న ప్రజలు నిత్యం ఏదో ఒక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ హాస్పిటలకు ఖర్చు చేస్తూ వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రాణాలను హరిస్తున్న డంపింగ్ యార్డ్‌ను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణానికి దూరంగా తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్కె ఆదిల్, రూరల్ కార్యదర్శి ఉప్పులూరు బాలగురయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు అమలు చేయాలి

కలసపాడు, మార్చి 7 ప్రభాతవార్త:

గ్రామీణ ఉపాధి హామీ పనులు వెంటనే ప్రతి గ్రామంలో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కారు లాజరస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనులు లేక రైతులు రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, పనులు లేక ఎక్కడికి వలస వెళుతున్నారని వెంటనే ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కారు ఎజ్రా, ఉపాధ్యక్షులుగా కారు నతానిల్, గుడిమే సుదర్శన్ సగిలి గుంయ్య, నాయకులు పెద్దిటి యేసు రత్నం, ఆవాజ్, కమిటీ అధ్యక్షుడు షేక్ నాగర్వల్లి, షేక్ హుస్సేన్ పీరా లు పాల్గొన్నారు.

సంఘమిత్రలే మూల స్తంభాలు

తంబళ్లపల్లె మార్చి 7 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె, కోసువారిపల్లె ఇండియన్ బ్యాంకుల ఆర్థిక లావాదేవీలలో సహకరిస్తున్న సంఘమిత్రలు బ్యాంకులకు మూల స్తంభాలుగా నిలిచారని బ్యాంకు మేనేజర్లు ప్రవీణ్ కుమార్, నాగరాజులు కొనియాడారు. శనివారం ఐకెపి కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం సందర్భంగా సంఘ మిత్రలను ఘనంగా సత్కరించి చిరు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం తోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి బ్యాంకుల ద్వారా సహకరిస్తున్న సంఘమిత్రలు భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని కోరారు. ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏపీఎం గంగాధర్ లు సంఘమిత్ర ల పనితీరును అభినందిస్తూ బ్యాంకు మేనేజర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సంఘ మిత్రలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం..

కడప కార్పొరేషన్ మార్చి 7 ప్రభాతవార్త:

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మయాన జకియా ఖానమ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి, బిజెపి కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డిలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడప జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం కడప ఐఎంఏ హాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల ఆరోగ్యం సాధికారత స్వాభిమానం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బిసి గురుకుల పాఠశాల నిర్వహణ తీరు ఆదర్శప్రాయం

తంబళ్లపల్లె మార్చి 7 ప్రభాతవార్త ః

బిసి గురుకుల పాఠశాల లో విద్యతోపాటు క్రీడలలో విద్యార్థుల ప్రతిభ, భోజనం మెనూ నిర్వహణ పై రాష్ట్ర ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాపరెడ్డి ప్రశంసించారు. శనివారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి పాఠశాలల్లోని వంటగది, స్టోర్ రూమ్ తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. భోజనం, ఆహార పదార్థాలు క్వాలిటీ, క్వాంటిటీ లపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి విద్యా విధానంపై పలు ప్రశ్నలను సంధించి వారి నుండి సానుకూల సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు క్రీడలు, పెద్దలపట్ల గౌరవం ప్రదర్శించి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికపై వారికి సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థుల విద్య, సౌకర్యాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందానికి సూచించారు. ఆయన వెంట జిల్లా డివైఈవో లోకేశ్వర్ రెడ్డి, ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ రామాంజనేయులు రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ దుర్గమ్మ గ్రామోత్సవం

వేంపల్లె:మార్చి 07(ప్రభాత వార్త)

స్థానిక పట్టణంలోని సాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో శ్రీ దుర్గా దేవి, సింహవాహన, ధ్వజ, శిఖర, కలశ ప్రతిష్ట, పంచలోహ విగ్రహ చర ప్రతిష్ట మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయని ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ రాయిపెద్ది సుబ్బరామశర్మ, బ్రహ్మశ్రీ శంకరమంచి సాయిప్రసాద్ నేతృత్వంలో 2వ రోజు మూల విరాట్, ఉత్సవమూర్తి గ్రామోత్సవం, ధ్వజయంత్ర ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్టలు, క్షీరాభిషేకం, శతచండీహోమాలు, పుష్పాభిషేకం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఈ ప్రతిష్టా మహోత్సవాల్లో పాల్గొని శ్రీ దుర్గమ్మ కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

ఉత్తమ పాఠశాలగా జిల్లా పరిషత్ పాఠశాల

యర్రగుంట్ల మార్చి 7, ప్రభాతవార్త:

భారతదేశంలోని ప్రథమ స్థానంగా పనిచేస్తున్న ఎడ్యుకెన్టిన్ సంస్థ నిర్వహించిన సర్వేలో యర్రగుంట్ల ముద్దునూరు రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపిక అయిందని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గురు భాస్కర్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 15 లక్షల పాఠశాలల్లో యర్రగుంట్ల పాఠశాల ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

యర్రగుంట్ల విస్తృత తనిఖీలు

యర్రగుంట్ల మార్చి 7, ప్రభాతవార్త:

శనివారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేశారు. అందరూ నిద్రలోనే ఉండగా ఆకస్మిక సోదాలకు దిగారు. యర్రగుంట్ల పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ప్రతి ఇంటినీ పరిశీలించారు. సరైన పత్రాలు లేని 23 బైకులు, 2 ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు మార్చి 7 ప్రభాతవార్త

టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం, పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం మైదుకూరు రోడ్డులోని అన్వర్వాలు వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ పట్టణంలోని పాదచారులకు నిరాశేయులకు నిరుపేదలకు తన అన్నదానంతో భోజనం వసతి కల్పిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస్ యాదవ్ నల్లం రవిశంకర్ బంగి శివ జయచంద్ర బోడె ప్రసాద్ యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనగలు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన టిడిపి జిల్లా అధ్యక్షులు

ముద్దనూరు, మార్చి07 ప్రభాతవార్త:

మండల పరిధిలోని బుద్ద శనగలు కొనుగోలు కేంద్రాన్ని శనివారం తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పరిశీలించి, తూకాలలో వ్యత్యాసాలు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రైతులను వారి సమస్యలపై ఆరా తీశారు. శనగలు తీసుకువచ్చే రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్ర సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పురుషోత్తం, మధుసాగర్ రెడ్డి, మురళి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

దువ్వూరు, మార్చి 07, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో అజయ్ రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. కృష్ణంపల్లె ఉరుసు సందర్భంగా జెయింట్ వీల్ వద్ద నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన కళ్యాణ్ మరో నలుగురు కులం పేరుతో దూషించారని, కొట్టారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఈ కేసును డిఎస్పీకి బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సెకండరీగ్రేడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు, మార్చి 7 ప్రభాతవార్త:

సెకండరీ గ్రేడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శిగా నియమితులైన ఎస్టీయూ రాష్ట్రనాయకుడు పి.రమణారెడ్డికి ఎస్టీయు మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.సత్యనారాయణ, ఎం.బాలరాజు నాయక్ ల ఆధ్వర్యంలో శనివారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఎస్జీటీగా నియామకం పొంది సుమారు 30 నుండి 35 సంవత్సరాలు సర్వీసు చేసిన తరువాత కూడా పదోన్నతులకు నోచుకోక ఎస్జీటీలు గానే పదవీ విరమణ చెందడం చాలా అన్యాయమన్నారు. చట్ట సవరణ చేసి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించినపుడు మాత్రమే ప్రభుత్వ విద్యారంగానికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే తల్లికి వందనం అమలు చేయాలన్నారు. అరకొరగా వస్తున్న పాఠశాల నిర్వహణనిధులు ఏమాత్రం సరిపోవడంలేదని,నిర్వహణ నిధులను రెట్టింపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.వి.రమణయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్ బాబు,జిల్లాఆర్థికకమిటీ సభ్యుడు కె.వి.సత్యనారాయణ, రీజనల్ ఆఫీస్ ఇన్చార్జి కస్తూరి శ్రీనివాసులు, మండల శాఖ ఆర్థిక కార్యదర్శి పి.గురుప్రసాద్, జిల్లాకమిటీసభ్యులు జి.రమణారెడ్డి, మూల రామకృష్ణారెడ్డి, మండల శాఖ గౌరవాధ్యక్షుడు బి భాస్కర్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు,మండలశాఖ కార్యవర్గ సభ్యులు,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది, సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి చేయాలి

దువ్వూరు, మార్చి 07, ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అలాగే ఈనెల 14న 116వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఛలో విజయవాడ కార్యక్రమాన్ని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నేరాలు అరికట్టేందుకు సంఘటితంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పేద గర్భిణీ స్త్రీలు ఆరోగ్య సంరక్షణ కొరకు కృషి చేయాలన్నారు. మహిళల ఆత్మ గౌరవం కోసం సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని అలాగే పొదుపు సంఘాల మహిళల కొరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోరికల సాధన కొరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకట నారాయణ, లక్ష్మయ్య, నాగభూషణం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో సంక్షోభం ఇబ్బంది పడుతున్న ప్రజానీకం

కడప కార్పొరేషన్ మార్చి 7 ప్రభాతవార్త:

ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర సంక్షోభం నెలకొన్నది. దేశంలో కూడా అదే పరిస్థితి ఉన్నదని దీని కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతాయని, నిత్యవసర ధరలు పెరుగుతాయని సామాన్యులు ఇబ్బంది పడతారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్ అన్నారు. శనివారం కడప ప్రెస్ క్లబ్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీహార్ సీఎం నితీష్ కుమార్ బిజెపి చేతిలో బలి పశువు అయ్యారు. వైయస్సార్ కుటుంబం, చంద్రబాబు లు పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఏపీలో మళ్లీ కాంగ్రెస్ వచ్చే అవకాశం ఉందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఉద్యోగులు సభను జయప్రదం చేయండి..

యర్రగుంట్ల : మార్చి 7 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పని చేయుచున్న ఓసి, ఓబిసి, బిసి మరియు మైనారిటీ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై విజయవాడ బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రము 6 గం నుండి 9 గం వరకు 'సమానత్వం కోసం మహాసభ' నిర్వహిస్తున్నట్లు శనివారం ఏపీ స్టేట్ సెక్రటరీ శ్రీ కోట శ్రీనివాస్ తెలిపారు. ఓసి, ఓబిసి, బిసి, మైనారిటీ సంఘాల ముఖ్యనేతలు పాల్గొనే ఈ కార్యక్రమానికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పని చేయుచున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో రాష్ట్రము నలుమూలలనుండి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేతు రామకృష్ణారెడ్డి స్టేట్ జెన్కో సెక్రెటరీ పి మాధవరెడ్డి. ఏసీ రాజేష్. వి విహారి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

వీరపునాయన పల్లి మార్చ్07, ప్రభాత వార్త:

మండలంలోని గొర్రె కాపరులు తమ గొర్రెల మేపుకొనుటకు కాజీపేట మండలం తవారిపల్లెకు వలస వెళ్లారు ఈ క్రమంలో శనివారం సాయంత్రం అక్కడ గొర్రె పిల్లలపై కుక్కలు మూగుమ్మడిగా దాడి చేయడంతో 60 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు తెలిపారు. అనిమెల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, శంకర, చిన్న రెడ్డయ్య, రత్నాకర ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ మేత లేకపోవడంతో వలస వెళ్లవలసి వచ్చిందని తెలిపారు.

నారాయణ పాఠశాలలో మహిళా దినోత్సవం

బద్వేల్ మార్చి 7 ప్రభాతవార్త :

స్థానిక తెలుగు గంగా కాలనీలో ఉండే నారాయణ ఒలంపియాడ్ పాఠశాల యందు మార్చి 8 వ తేదీన జరిగే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా మహిళా దినోత్సవాన్ని చాలా ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి ఎనిమిదో తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని మహిళల సామాజిక ఆర్థిక, సాంస్కృతిక, మరియు రాజకీయ విజయాలకు వేడుకగా లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ మహిళా దినోత్సవము అనేది స్త్రీ శక్తిని వారి పోరాటాలు మరియు సాధించిన విజయాలను గౌరవించే ఒక ప్రత్యేక దినమని, సమాజంలో స్త్రీ పాత్ర కీలకమైనదని కుటుంబ బాధ్యతలే కాకుండా నేడు ప్రతి రంగంలో పురుషులతోపాటు సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల పేరెంట్స్ (మహిళలు) పాల్గొన్నారు. వారికి పాఠశాల ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్ శర్మ, హెచ్ఆర్ డిపార్ట్మెంట్ భారతి మేడం, హై స్కూల్ కోఆర్డినేటర్ వినోద్, ఈ ఛామ్స్ కోఆర్డినేటర్ ఇందిర, అకడమిక్ డీన్ నరసింహ, వైస్ ప్రిన్సిపల్స్ రఘురామిరెడ్డి, పావని, రాజేశ్వరి, భారతి, ఏవో శ్రీనివాసులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేక పూజా కార్యక్రమాలు

గోపవరం. మార్చి. 7. ప్రభాతవార్త.

మండలం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నందు పాల్గుణ మాసం ప్రారంభంతో మూడవ శనివారం సందర్భంగా వేకువ జామునే హోమం,స్వామి వారికి ప్రత్యేక అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది,తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు,స్వామి అమ్మవారికి నేత్రముకు సూర్య కిరణాలు తాకినవి వచ్చిన భక్తులు అవిధముగా తాకిన సూర్య కిరణాల కాంతిలో చూస్తూ ఉంటే మాకు చూడటానికి రెండు కళ్ళు చాలటం లేదు అని మనసుకు చాలా సంతోషం గా ఉన్నది అని ఈ దర్శనం వలన మా జన్మ ధన్యం అయినది అని కొనియాడారు అలాగే మేము ప్రతి వారము స్వామి వారిని దర్శించుకోవడం వలన మాకు ఉన్న అనారోగ్య సమస్యలు, చీడ, పీడ,నవగ్రహ దోషాలు ఏలినాటి శని దోషం తొలగిపోయి అనుకున్న పనులు సకాలంలో నెరవేరుతూ ఉన్నాయి తెలియజేశారు,తదుపరి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు స్వామివారి తాంబూలం అందిచి అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

విద్యాంజలి 2.0 పై కీలక పాత్ర పోషించాలి

తంబళ్లపల్లె మార్చి 7 ప్రభాతవార్త ః

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాంజలి 2.0 విజయవంతానికి ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు లు సూచించారు. శనివారం ఎంఆర్సిలో ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో సహజ భాగస్వామ్యంతో పాటు పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం పొందే విధానాన్ని విశదీకరించారు. పాఠశాలల్లో విద్యా ప్రగతి ధ్యేయంగా పాఠశాలల రూపురేఖలు మార్చడానికి సహకరించాలన్నారు. విద్యాంజలి 2.0 యొక్క లక్ష్యం పాఠశాలల బలోపేతం, విద్యా ప్రగతి, అవస్థాపన సౌకర్యం కల్పన కు ఎన్నారైలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు, వైద్యులు, గృహిణులు, సామాన్యుల సైతం తమ సేవలను ఏ రూపంలోనైనా వినియోగించుకోవాలన్నారు. విద్యాంజలి 2.0 పై రీసెర్చ్ పర్సన్ కె వి సత్యనారాయణ రావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ శివకుమార్, రెడ్డికుమార్, ఎమ్మార్, సిఆర్ఎం టీచర్లు పాల్గొన్నారు.

దేవాలయాలను సందర్శించిన జిల్లా జడ్జి

పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

చౌడేపల్లి, మార్చి 7 ప్రభాతవార్త

మండలంలోని ప్రముఖ దేవాలయాలను జిల్లా జడ్జి అరుణసారిక సందర్శించారు. పట్టణంలోని శ్రీ అభీష్టద మృత్యుజయేశ్వరస్వామి, శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయాలను సందర్శించారు. మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి మహిమలను తెలియజేసారు. అనంతరం బోయకొండలో ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. మండపంలో వేదాశీర్వాదం, అమ్మవారి మెమొంటోతో సత్కరించి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫాబేగం, పుంగనూరు రూరల్(చౌడేపల్లి)సిఐ సాయిప్రసాద్, ఎస్ఐ చిన్నరెడ్డెప్పలు పాల్గొన్నారు.

చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సమతుల్య విధానం అవసరం

రాయచోటి మార్చి 7 ప్రభాతవార్త

సోషల్ మీడియా వినియోగం పిల్లల మానసిక ఆరోగ్యం, విద్యా ఫలితాలు, ప్రవర్తనపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నందున వారి భద్రతను పరిరక్షించే సమతుల్య విధానం అవసరమని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కె. శామ్యూల్ పేర్కొన్నారు. ఈరోజు ఉదయం రాయచోటిలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి రచించిన"16 ఏళ్లలోపు చిన్నారుల సోషల్ మీడియా వినియోగం – నియంత్రణ" అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో చౌకైన డేటా సేవలు, స్మార్ట్‌ఫోన్ల విస్తరణ కారణంగా చిన్నారుల సోషల్ మీడియా వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. డిజిటల్ ప్రపంచం చిన్నారులకు విద్యా అవకాశాలు, సృజనాత్మకత అభివృద్ధి, ప్రపంచంతో అనుసంధానం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, అదే సమయంలో మానసిక ఆరోగ్యం, సైబర్ భద్రత, డిజిటల్ వ్యసనం వంటి అనేక సవాళ్లను కూడా తీసుకొస్తోందన్నారు.ఈ నేపథ్యంలో చిన్నారుల సోషల్ మీడియా వినియోగాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 16 ఏళ్లలోపు చిన్నారులు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు అవసరమైన సమగ్ర విధాన వ్యవస్థను రచయిత మడితాటి నరసింహారెడ్డి తన పుస్తకంలో స్పష్టంగా వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మడితాటి నరసింహారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆన్‌లైన్ భద్రతపై జరుగుతున్న చర్చలకు ఈ పుస్తకం అర్థవంతమైన దిశానిర్దేశం అందించి, భద్రతతో కూడిన, బాధ్యతాయుతమైన డిజిటల్ వాతావరణ నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రాజు, ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పీలేరు మార్చి 07 ప్రభాతవార్త:

సన్మానిస్తున్న దృశ్యం

సబ్ డివిజన్ తపాలా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఇందిరమ్మ కాలనీ బి.ఓ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పి. లావణ్య 5,00,000 రూపాయల నూతన ప్రీమియం సాధించి దాదాపు 50 కుటుంబాలకు భీమా రక్షణ కల్పించారు. అలాగే జంగావాండ్లపల్లి బి.ఓ కు చెందిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పూజిత 500 ఖాతాలు ప్రారంభించి విశేష ప్రతిభ కనబరిచారు .వారి సేవలను అభినందిస్తూ పిలేరు సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ రామ్మోహన్‌రెడ్డి ని సన్మానించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రేపు నిర్వహించబడబోయే సుకన్య సమృద్ధి యోజన డ్రైవ్‌ను విజయవంతం చేయాలని, ప్రతి కుటుంబం 10 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఆడపిల్లకు పోస్ట్ ఆఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన ఖాతా ప్రారంభించాలని "చదివిద్దాం ఆడపిల్లలను.. రక్షిద్దాం వారి భవిష్యత్తును! పోస్టాఫీసు సుకన్య ఖాతాతో అందించండి ఆర్థిక రక్షణ.""ఆడపిల్లల ఆర్థిక భద్రతే దేశాభివృద్ధికి మూలం" ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీస్ హరీష్ రాజు , దేవేంద్ర పాల్గొన్నారు.

వికాస్ హై స్కూల్లో ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ డే

కడప సిటీ, మార్చి 7 ప్రభాతవార్త

నగరంలో ఐటిఐ సర్కిల్ దగ్గర ఉన్న వికాస్ స్కూల్లో ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీప్రైమరీ విద్యార్థిని విద్యార్థులు ఫ్రూట్స్ మరియు వెజిటల్ వేషధారణలో పాల్గొన్నారు. పిల్లలు ఫ్రూట్స్ మరియు వెజిటబుల్స్‌లో ఉన్న న్యూట్రియంట్స్ ను వివరించడం తల్లి తండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ వికాస్ హరి మాట్లాడుతూ పిల్లలకు ఆహారం మీద అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ప్రీప్రైమరీ విద్యార్థులతో ఫ్రూట్స్, వెజిటబుల్స్ డే నిర్వహిస్తామని అలాగే పిల్లలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి రోజు ఫ్రూట్స్ తినడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ హమీద్, ప్రైమరీ ఇంచార్జ్ దివ్య ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : ఆర్డీవో

పీలేరు మార్చి 07 ప్రభాతవార్త:

పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో భూసమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో ఎ. శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వెబ్లండ్ కరెక్షన్లపై మెగా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మేళలో పది వెబ్లండ్ కరెక్షన్లు చేసినట్లు తెలిపారు. అసైన్మెంట్, భూస్వాధీనం, ఆధార్ సీడింగ్, ప్రయివేట్, జీరో నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాగా మార్చడం. డూప్లికేట్ సర్వే నెంబర్లు తొలగింపు వంటి అధికారాలు ప్రభుత్వం తహాశీల్దార్లకు అప్పగించిందని తెలిపారు. కేవలం రీసర్వే జరిగే గ్రామాల్లో సవరణలు, ఆర్వోఆర్ విస్తీర్ణం సవరణలు తప్పుగా మ్యాపింగ్ చేసిన ఖాతాల సవరణ, భూమి స్వభావ మార్పు, వివిధ రిజిస్టర్లలో చేర్పులు, తొలగింపులు ఆర్డీవోకు అప్పగించారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎక్కువుగా ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్లు ఎం. శివకుమార్, నరేంద్రకుమార్, మహేశ్వరబాయి, సయ్యద్బాషా. మధుసూదన్, ప్రమీల, ఫణికుమార్, రవినాయక్, ఏవో సురేష్ బాబు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

లక్కిరెడ్డిపల్లి: మార్చి 07 ప్రభాతవార్త

మండల పరిధిలోని దేవలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నిమ్మనపల్లి మండలం గంగాపురం పల్లి వాస్తవ్యులు బి రెడ్డమ్మ ఆర్థిక సహకారంతో క్రీడా దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు లయన్ శ్యామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా దాత బి రెడ్డమ్మ మాట్లాడుతూ దివంగత బి వెంకటరమణారెడ్డి జ్ఞాపకార్థం పిల్లలకు మంచి సేవా కార్యక్రమాలను చేయాలని ఉద్దేశ్యంతో లక్కిరెడ్డిపల్లి మండలం దేవలంపల్లి పాఠశాలకు క్రీడా దుస్తులు అందించడం జరిగిందని తెలియజేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని మంచి చదువులు చదువుకోవాలని ఎప్పుడూ తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి మాట్లాడుతూ లయన్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు రాయచోటి నియోజకవర్గం లో చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం సంతోష్ కరమైన విషయం అని లయన్ క్లబ్ వారిని ఆదర్శం తీసుకొని దాతలు ముందుకు వచ్చి మంచి సేవ కార్యక్రమాలు చేయాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్, వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి, సభ్యులు లయన్ ఎస్ రామాంజనేయరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శయనోత్సవం

రామసముద్రం మార్చి 7 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని దిగువ పేటలో కొలువైన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో శనివారం శయనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు బాల స్వామి ఆధ్వర్యంలో అర్చకులు బృందం వారిచే ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేలుకొలిపి ఆలయ శుద్ధి చేసి స్వామి వారికి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.స్వామి వారికి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి, పండ్లు, ఫలహారాలు సమర్పించారు, ఈ శయనోత్సవ వేడుకల అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు స్వామి వారిని దర్శనం కల్పించి తీర్థ ప్రసాధాలు అందజేశారు.

మాదకద్రవ్యాలపై ప్రయాణికులకు అవగాహన

యర్రగుంట్ల మార్చి 7 ,ప్రభాతవార్త:

మాదక ద్రవ్యాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యర్రగుంట్ల జిఆర్పిఎఫ్ ఎస్సై భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు మార్చి 7 ప్రభాతవార్త

మండలం పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణంలోని ప్రభుత్వ న్యాయవాది జింకా విజయలక్ష్మి ప్రముఖ గైనకాలజిస్ట్ ఏ సుజన గౌరవ అతిథిగా కరస్పాండెంట్ బాబమ్మ హాజరైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జింక విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల వ్యక్తిత్వ వికాసాన్ని గురించి మహిళల మనోధైర్యాన్ని వివరించారు ప్రపంచంలోని దేశాలన్నింటిలో భారతదేశం మహిళలకి గౌరవాన్ని ఏ దేశం ఇవ్వదని అలాగే ఒక మంచి సమాజాన్ని నిర్మించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు డాక్టర్ సృజన మాట్లాడుతూ మహిళల శక్తి ప్రతిభ సహనం మరియు సాధనలను గుర్తు చేసుకునే రోజు అని మహిళల ఆరోగ్యం గా ఉండడం ముఖ్యమని చాలామంది మహిళలు తమ కుటుంబాలు ఆరోగ్యం గురించి ఎక్కువగా ఆలోచిస్తారని తన తమ ఆరోగ్యాన్ని మాత్రం నిరక్ష్యం చేస్తారని ఇది సరైనది కాదని తెలిపారు కళాశాల కో డైరెక్టర్ శైలూష మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విలువలు శిక్షణతో కూడిన మహిళలుగా తీర్చిదిద్ది వాళ్ళలో నాయకత్వ లక్షణాలను నేర్పించడం వలన సమాజ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి చెందుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నాగురు రవీంద్రారెడ్డి డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు వివిధ విభాగ అధిపతులు ఆలీ కుమార్ జాబీర్ లావణ్య మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకం

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

పీలేరు మార్చి 07, ప్రభాతవార్త:

స్థానిక ఇందిరమ్మకాలనీ లోని జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు టిడిపి పీలేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె. అగస్తీశ్వర్ గతంలో ఇదే పాఠశాలలో తెలుగు అధ్యాపకురాలుగా పనిచేసి ప్రస్తుతం వాల్మీకిపురం పీసీసీ హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న కె.మంగమ్మ దంపతులు టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా సుమారు రూ.7,000 విలువ కలిగిన ప్యాడ్స్, జామెంటరీ బాక్సులు, పెన్నులు వితరణ గా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవతరగతి పరీక్షల్లో అందరూ ఉతీర్ణత సాధించాలని, అలాగే పరీక్షలకు వెళ్ళే సమయంలో అన్ని వస్తువులు కొత్తవి తీసుకెళ్లినట్లయితే విద్యార్థులు మరింత ఉత్సాహంగా పరీక్షలు రాయాలనే తలంపుతో ఈ ప్రోత్సాహకం అందించినట్లు తెలిపారు. అలాగే హైస్కూల్ నుండి ఉన్నత చదువులకు వెళుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అధ్యాపకులతో పాటు సమాజంలోనూ గౌరవప్రదంగా నడుచుకునేందుకు విలువలతో కూడిన విద్య అవసరమని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో మెరిసిన హైస్కూల్ విద్యార్థి

గాలివీడు, మార్చి 7(ప్రభాతవార్త):

మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న యోజిత్ శ్రీ నందన్ అనే విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో ప్రతిభ చాటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాఫర్ తెలిపారు. మార్చి 6వ తేదీన జిల్లా విద్యా శిక్షణా కేంద్రం(డైట్)లో నిర్వహించిన లాంగ్వేజీ ఫెస్టివల్‌లో ఆంగ్ల భాష విభాగంలో పాల్గొన్న యోజిత్‌శ్రీ నందన్ ప్రథమస్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో రాణించడం పట్ల ఎంఈఓలు నాగరాజు, శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

లక్ష్మీ పాలెంలో కనుల పండువగా వసంతోత్సవం

బద్వేలు అర్బన్, మార్చి 7, ప్రభాతవార్త

బద్వేల్ మండలంలోని లక్ష్మీ పాలెం గ్రామంలో వెలసిన పురాతన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం తీర్థవాసి వసంతోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు గ్రామోత్సవానికి రాగా యువకులు గ్రామస్తులు మహిళలు రంగులు కలిపిన నీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవంలో సందడిగా కనిపించారు భక్తులందరూ ఐకమత్యంగా వసంతోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు గ్రామోత్సవం ఆలయం కేరింతర్వాత స్వామివారికి అమ్మవార్లకు చక్రస్థానం చేయించి అనంతరం పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు రాత్రి ఆలయంలో ధ్వజ అవరోహణ కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అనుమతులు లేకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

కలికిరి, మార్చి 7, ప్రభాతవార్త:

కలికిరి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మండల స్థాయి అధికారులు అదే విధంగా ప్రభుత్వ వైద్యాధికారుల అనుమతులు లేకుండా గ్రామాల్లో ఎవరైనా వైద్య శిబిరాలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో భానుమూర్తిరావు, మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కావ్య గంధలు హెచ్చరించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం, రోగుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయడం లాంటి ఫిర్యాదులు తమ దృష్టికి రావడం జరిగిందని వైద్యాధికారిణి కావ్యగంధ తెలిపారు. దీంతో ఎంపీడీవో వైద్యాధికారిణిలు మాట్లాడుతూ ఇకమీదట అధికారులకు తెలియకుండా వైద్యశిబిరాలు నిర్వహిస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామంటే ప్రజలు నమ్మవద్దని అలాంటి సంఘటనలు జరిగితే వైద్యాధికారుల దృష్టికి తేవాలని ప్రజలకు వారు సూచించారు.

ఫాల్గుణ మాస ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్, మార్చి 7, ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం వీరేశచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కుంకుమ అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ప్రత్యేక అభిషేక దాతలుగా వెంకటేశ్వర్లు సతీమణి మహాలక్ష్మి, రామ సుబ్బయ్య సతీమణి నాగమణి, గోపాల కృష్ణ ధర్మ పత్ని రాజేశ్వరి, రఘు రామయ్య సతీమణి కనక దుర్గ, మాలే పాటి సునీల్ కుమార్ సతీమణి నవలత సముద్రాల రాజేంద్ర ప్రసాద్ సతీమణి సౌజన్య వల్లంకొండు శివ కుమార్ సతీమణి పుష్పలత, కొండారెడ్డి సతీమణి సుభాషిణి, తొడేటి సుబ్బయ్య సతీమణి తిరుపతమ్మ రామబోయిన మురళీ సతీమణి సునీత మెంటా నాగేంద్ర సతీమణి సౌజన్య లక్ష్మీ కుటుంబ సభ్యులు పాల్గొనగా ప్రత్యేక ఉభయ దాతలుగా బొమ్మి దాయుల ఆదినారాయణ సతీమణి సౌజన్య కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారి ప్రత్యేక తీర్థప్రసాదాలు పొందారు. వీరికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

కొండ గంగమ్మ జాతరకు చలువ పందిళ్లు

పెండ్లిమర్రి, మార్చి 7, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి సంబంధించి శ్రీ కొండ గంగమ్మ తిరునాళ్ల జాతర ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 3 రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతుందని సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి మేకల మారుతీ ప్రసాద్ యాదవ్ తెలిపారు. దేవస్థానం వద్ద జరుగు తిరునాళ్ల జాతరకు చలువ పందిళ్ళు, ఎలక్ట్రికల్ డెకరేషన్ చేసేందుకు ఆసక్తి గల వారు దేవస్థానం తమను సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలు

పులివెందుల ,మార్చి 7 , ప్రభాతవార్త :

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన ముందస్తు వేడుకలు శనివారం కళాశాల ఉమెన్ సెల్ విభాగం మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలు సాధించినప్పుడే మహిళలకు సాధికారత లభిస్తుందన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారి పాలన కారణం గానో లేక స్వాతంత్రం లెకనో అప్పట్లో మహిళల పట్ల వివక్ష ఉండేదని,ప్రస్తుతం ప్రతి మహిళా విద్యను అందిపుచ్చుకుని అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రానిస్తూ,ఆర్థిక పరమైన సహకారంతో కుటుంబంలో వెలుగులు నింపుతోందని, చిన్న చిన్న పొరపాట్లకు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్న తరుణంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తూ ఉన్నారని, న్యాయ స్థానం సేవలను సద్వినియోగం చేసుకొంటూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మహిళకు ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత మాట్లాడుతూ విజయం సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేయాలన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త డా.కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళా జీవితంలో ఎదురయ్యే కష్టాలను, బాధలను, అవమానాలను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొని వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ బాల నారాయణ, ప్రొద్యూసర్ మంజునాథ్‌రెడ్డి, పులివెందుల హరి,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సౌర వెలుగులు

రామసముద్రం మార్చి 7 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం, సచివాలయం పై కప్పుకు సౌర పలకలు అమర్చారు.వీటిని శనివారం ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వీటి ఏర్పాటు కోసం ఎన్‌టిపిసి విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని, ఈ మేరకు మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్ టాప్ 300 మేఘా వాట్ల సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గృహ అవసరాలకు కూడా తమ ఇంటి పై కప్పు పై సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.